క్లుప్తంగా

మౌలిక వసతుల కల్పనకు కృషి

నకిరేకల్ : పట్టణంలోని అన్ని వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్ అన్నారు. నకిరేకల్ మున్సిపాలిటీలోని 15వ వార్డులో కౌన్సిలర్ యాసారం లక్ష్మీతో కలిసి గురువారం ఆమె పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

26న సంస్మరణ సభ

చిట్యాల: తెలంగాణ గ్రామ నామాల పరిశోధకుడు డాక్టర్ మండల స్వామి సంస్మరణ సభను ఈ నెల 26వ తేదీన నల్లగొండలోని యూటీఎఫ్ భవన్‌లో నిర్వహించనున్నట్లు సృజన సాహితి అధ్యక్ష కార్యదర్శులు పెరుమాళ్ల ఆనంద్, సాగర్ల సత్తయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 'స్నేహ పరిమళం' పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఐక్యరాజ్యసమితి ఆవిర్భావ దినోత్సవం

నకిరేకల్ : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం ఐక్యరాజ్యసమితి ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బెల్లి యాదయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీసీఐ కేంద్రాలను ప్రారంభించాలి

చిట్యాల: సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లం మహేష్, చిట్యాల మండల రూరల్ కార్యదర్శి అర్రూరి శ్రీను ప్రభుత్వాన్ని కోరారు. వెలిమినేడు గ్రామంలో గురువారం జరిగిన సీపీఎం సమావేశంలో వారు మాట్లాడారు. మండల కమిటీ సభ్యుడు నెల్లికంటి నర్సింహ, గ్రామ కార్యదర్శి పంది నరేష్, నాతి వెంకట్రామయ్య పాల్గొన్నారు.

మర్రిగూడ : ప్రభుత్వం సీసీఐ కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని రైతు సంఘం జిల్లా కోశాధికారి బుర్ర శేఖర్ కోరారు. గురువారం మర్రిగూడ సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు జక్కుల అంజయ్య, యాదయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు తీర్పు చారిత్రాత్మకం

నల్లగొండ టూటౌన్ : బాల్య వివాహాలపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమని ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ నాగరాజు అన్నారు. గురువారం నల్లగొండలోని ఆ సంస్థ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థ కోఆర్డినేటర్లు శోభారాణి, వి.పర్వతాలు, ఫైనాన్స్ మేనేజర్ వెంకటేశ్, హెల్లెన్, స్వప్న, జాన్సీ పాల్గొన్నారు.

ఫ్యాషన్ డిజైనింగ్‌లో రాణించాలి

నల్లగొండ రూరల్: విద్యార్థినులు ఫ్యాషన్ డిజైనింగ్‌లో కూడా రాణించాలని నల్లగొండ పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరాజు అన్నారు. గురువారం కళాశాలలో విద్యార్థినులు ప్రమిదలపై ఆకర్షణీయంగా డిజైన్లు రూపొందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మహిళలకు మార్కెటింగ్ వ్యవస్థపై అవగాహన ఉండాలన్నారు. ఎన్ఎస్ఎస్ పీఓలు అమరావతి, సుధ, సరిత, వనజ, స్వామి పాల్గొన్నారు.

29న 'చలో నల్లగొండ'

చిట్యాల: ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీన నల్లగొండలో నిర్వహించనున్న మాదిగల ధర్మయుద్ధ మహాసభను విజయవంతం చేయాలని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం కోరారు. చిట్యాలలో గురువారం జరిగిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఎస్ఎఫ్ నాయకుల నకిరేకల్ నియోజకవర్గ స్థాయి సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఎంఎస్‌పీ నకిరేకల్ నియోజకవర్గ కన్వీనర్ మేడి శంకర్ , ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి గోపాల్, జిల్లా ఉపాధ్యక్షుడు చింత శివశంకర్ పాల్గొన్నారు.

నూతన విద్యా విధానం రద్దు చేయాలి

నల్లగొండ టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జాతీయ నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా నిర్మాణ బాధ్యుడు నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నల్లగొండ పట్టణంలోని మగ్దూం భవన్‌లో జరిగిన ఏఐఎస్ఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు బరిగల వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు వలమల్ల ఆంజనేయులు, కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు రమావత్ శోభన్‌బాబు, కోశాధికారి సూర్యతేజ పాల్గొన్నారు.

స్త్రీల ఆరోగ్యంపై అవగాహన

నల్లగొండ రూరల్: స్త్రీలలో వచ్చే పలు గైనిక్ సమస్యలపై నల్లగొండ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరాజు, వైస్ ప్రిన్సిపాల్ కె.మంజుల, వెంకట్‌కృష్ణ, సూపరింటెండెంట్ డి.జ్యోతి, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ హరనాథ్, డాక్టర్ సుచరిత, డాక్టర్ లాలిత్య, డాక్టర్.సీహెచ్.సమత, డా.మల్లికార్జున్, వనజ, డా.జి.సరిత, డా.జి.శైలజ, డా.మల్లేష్, సంతోష్ కుమార్, ముని వైష్ణవిలు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లు ప్రారంభమెప్పుడో!

- సీసీఐ కేంద్రాల్లో ప్రారంభం కాని పత్తి కొనుగోళ్లు
- నిల్వ ఉంచుకోలేక తక్కువ ధరకు వ్యాపారులకు అమ్ముకుంటున్న రైతులు

శాలిగౌరారం: దేవుడు వరమిచ్చినా.. పూజారి అడ్డుకున్నట్లుగా ఉంది శాలిగౌరారం మండలంలోని సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం పరిస్థితి. మండలంలోని మాధారంకలాన్ గ్రామంలో గల టీఆర్ఆర్ కాటన్ మిల్లుకు సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని మంజూరు చేస్తూ ఇటీవల ప్రభుత్వం ప్రకటన జారీ చేసింది. అయితే నేటికీ ఆ కేంద్రం ప్రారంభానికి నోచుకోలేదు.



సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం మంజూరైన మాధారంకలాన్‌లోని టీఆర్ఆర్ కాటన్‌మిల్లు

23180 ఎకరాల్లో పత్తిపంట సాగు

వ్యవసాయ శాఖ నివేదిక ప్రకారం శాలిగౌరారం మండలంలో ప్రస్తుత వానాకాలం సీజన్‌లో 23,180 ఎకరాల్లో పత్తిపంట సాగవుతోంది. అయితే పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం కాకపోవడంతో నిల్వ చేసుకునే సౌకర్యం లేక, అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలు లేక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. కూలీలకు డబ్బులు చెల్లించడానికి, కుటుంబ అవసరాల నిమిత్తం రైతులు దళారులకు పత్తిని తక్కువ ధరలకు విక్రయించి తీవ్రంగా నష్టపోతున్నారు. పత్తికి క్వింటాలుకు ప్రభుత్వం రూ.7521లు మద్దతు ధర ప్రకటిస్తే పత్తి కొనుగోలు చేసే దళారులు అతి తక్కువ ధరకు రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మండలంలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని త్వరగా ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

పత్తి అమ్ముదామంటే సగం ధరకే అడుగుతున్నారు



నేను మూడెకరాల్లో పత్తిపంట సాగు చేశా. ఏరిన పత్తిని కుటుంబ అవసరాలు, కూలీల డబ్బుల కోసం అమ్మేందుకు ప్రయత్నిస్తే సగం ధరకే అడుగుతున్నారు. బయట పత్తిని అమ్మితే కనీసం పెట్టుబడులు కూడా పూడే పరిస్థితి లేదు. ప్రభుత్వం సీసీఐ కేంద్రాన్ని వెంటనే ప్రారంభించి రైతులకు న్యాయం చేయాలి.

– రేకల మల్లయ్య, రైతు, ఆకారం, శాలిగౌరారం

పత్తి కొనుగోలుకు సిద్ధంగా ఉన్నాం



మాధారంకలాన్ గ్రామ సమీపంలో ఉన్న టీఆర్ఆర్ కాటన్ మిల్లులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పత్తి కొనుగోళ్లకు సిద్ధంగా ఉన్నాం. వర్షాల కారణంగా అధికారికంగా కేంద్రాన్ని ప్రారంభించలేదు. పత్తికి నిర్ణీత తేమశాతం 12కు లోబడి ఉంటే వెంటనే కొనుగోలు చేస్తాం. రైతులు పత్తిని ఆరబెట్టుకొని వస్తే ప్రభుత్వ మద్దతు ధర రూ.7521 పొందవచ్చు.

– చీనానాయక్, శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి

తేమశాతం 20కిపైగా వస్తోంది

రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తున్న పత్తిలో 20 శాతానికిపైగా తేమ ఉంటోంది. దీంతో అంతా మొత్తంలో తేమ ఉన్న పత్తిని తాము కొనుగోలు చేయలేమని సీసీఐ అధికారులు చెబుతున్నారు. నిబంధనల ప్రకారం 8 నుంచి 12 శాతం తేమ ఉంటేనే కొనుగోలు చేస్తామంటున్నారు. రైతులు మరో వారం, పది రోజులు ఆగి తమ పత్తిని ఆరబెట్టుకుని కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలి. రైతులు పత్తిని ఆరబెట్టుకుని వచ్చి కొనుగోలు కేంద్రంలో ప్రభుత్వం అందించే మద్దతు ధర పొందాలి.

– కె. రవి, చండూరు మార్కెట్ కార్యదర్శి

ప్రారంభానికే పరిమితమా ?

మునుగోడు: నియోజకవర్గ కేంద్రమైన మునుగోడులోని పత్తి జిన్నింగ్ మిల్లులో సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఇటీవల ప్రారంభించారు. కానీ నేటికీ ఏ ఒక్క రైతు వద్ద కూడా పత్తి కొనుగోలు చేయలేదు. పత్తి ఎందుకు కొనుగోలు చేయడం లేదని రైతులు ప్రశ్నిస్తే.. నిబంధనల ప్రకారం 8 నుంచి 12 శాతం వరకు తేమశాతం వస్తేనే కొనుగోలు చేస్తామని, అంతకంటే ఎక్కువ వస్తే కొనుగోలు చేయలేమని సీసీఐ సిబ్బంది తేల్చి చెబుతున్నారు.

క్వింటాలుకు రూ.1500 లకుపైగా నష్టపోతున్న రైతులు..

ప్రస్తుతం పత్తి ధర మార్కెట్‌లో క్వింటాలుకు రూ.6వేల నుంచి రూ.6300 మాత్రమే ఉండడంతో వ్యాపారులు కనిష్ఠంగా రూ.5900 నుంచి రూ. 6200 వరకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఒక్కో రైతు ప్రభుత్వ మద్దతు ధర కంటే రూ.1500లకు తక్కువగా అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. నిబంధనల ప్రకారం తేమ శాతం ఉన్న రైతుల పత్తి అయినా కొనుగోలు చేస్తే బాగుండని రైతులు కోరుతున్నారు. ఈ విషయాన్ని మార్కెట్ అధికారుల దృష్టికి తీసుకెళ్తే సీసీఐ అధికారులు ముందుకు రానిది తాము ఏమీ చేయలేమని, మరో ఐదారు రోజుల వరకు పత్తి కొనుగోళ్లు చేయలేమని తేల్చి చెబుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకుని కొనుగోలు కేంద్రాల్లో పత్తిని కొనుగోలు చేసి ప్రభుత్వం ప్రకటించిన రూ. 7521 మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.



మునుగోడులో సీసీఐ కేంద్రాన్ని ప్రారంభించిన డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్)

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

చండూరు : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రైతు సేవా సహకార సంఘం చైర్‌పర్సన్ కోడి సుష్మవెంకన్న కోరారు. గురువారం మండలం పరిధిలోని అంగడిపేట, చండూరు, కొండాపురం, తేరట్‌పల్లి, కస్తాల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆర్డీఓ సుబ్రహ్మణ్యంతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలు పాటించి మద్దతు ధర పొందాలన్నారు. కేంద్రానికి రైతులు ధాన్యం తెచ్చే సమయంలో ఆధార్ కార్డు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాంరెడ్డి, తహసీల్దారు దశరథ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గట్టుప్పల్ మండల పరిధిలో తేరట్‌పల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కోడి సుష్మ ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దారు రాములు, కార్యదర్శి షఫీ, రైతులు, పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

కనగల్ : రైతులు తప్పనిసరిగా ప్యాడీ క్లీనర్లు వాడాలని డీఎస్ఓ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం కనగల్ మండల పరిధిలోని పర్వతగిరి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి కేంద్రంలో 4 కాంటాలు, 2 తేమ యంత్రాలు, 30 టార్పాలిన్లు అందుబాటులో ఉండాలన్నారు. నిబంధనల మేరకు 17 శాతం తేమ ఉన్న ధాన్యాన్ని అదేరోజు కాంటా వేసి కనగల్ మార్కెట్ యార్డ్‌కు పంపించాలని సూచించారు. సన్న ధాన్యం పండించే రైతులంతా ఐకేపీ కొనుగోలు కేంద్రం, కనగల్ మార్కెట్ యార్డులో అమ్ముకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం సంకు హరి, డీటీ జ్యోత్స్న, సీసీ వసంత, శివ, రైతులు పాల్గొన్నారు.



చండూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కోడి సుష్మ

మాదిగ జేఏసీ అధ్యక్షుడిగా చెక్క రమేష్

మర్రిగూడ : మాదిగ జేఏసీ యువజన విభాగం మండల అధ్యక్షుడిగా మండలంలోని దామెరభీమనపల్లి గ్రామానికి చెందిన చెక్క రమేష్ నియామకమయ్యారు. ఈమేరకు గురువారం ఆయన మునుగోడులో పిడమర్తి రవి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. కార్యక్రమంలో ఇరిగి గురునాథం, కూరపాటి సుదర్శన్, జోగు గణేశ్, మేడి చంద్రస్వామి, నరేష్, స్వామి, లింగస్వామి, నోముల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో అంత్యక్రియలు

నల్లగొండ టూటౌన్: శాంతి మహిళా మండలి వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న హేమలత అనారోగ్యంతో మరణించింది. గురువారం దాతల సహకారంతో హేమలత అంత్యక్రియలను వృద్ధాశ్రమ నిర్వాహకురాలు పిచ్చమ్మ నిర్వహించారు. ఈ సందర్భంగా అంత్యక్రియలకు సహకరించిన వారికి పిచ్చమ్మ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ దోర్నాల నగేష్, ఆర్ఎంపీ నరసింహ, ఇబ్రహీం, ఎండీ. సలీం పాల్గొన్నారు.

హైవేపై కారు బోల్తా .. తప్పిన ప్రమాదం

కేతేపల్లి: మండలకేంద్రంలో 65 నంబరు జాతీయ రహదారిపై గురువారం కారు బోల్తా కొట్టిన సంఘటనలో ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్తున్న కారు కేతేపల్లిలోని ఎస్సీ కాలనీ సమీపంలోకి చేరుకోగానే ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో లారీ వెనుక భాగానికి తగిలి అదుపుతప్పి రోడ్డుపై బోల్తా కొట్టింది. కారులో ఉన్న బెలూన్‌లు తెరుచుకోవడంతో అందులో ప్రయాణిస్తున్న విజయవాడకు చెందిన అమరేందర చౌదరి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలం వద్దకు చేరుకున్నారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం హైవే 1033 అంబులెన్స్‌లో నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

నాంపల్లి : టీఎస్ యూటీఎఫ్ నాంపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో నల్లగొండ-వరంగల్-ఖమ్మం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం గురువారం మండలంలోని గట్లమల్లేపల్లి కేజీబీవీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాగింది. ఈ కార్యక్రమంలో సిలువేరు నారాయణ, జింకల సత్యనారాయణ, పల్లేటి వెంకటయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కోమటిరెడ్డిని కలిసిన టీజీఓ నాయకులు



మంత్రితో టీజీఓ నాయకులు

నల్లగొండ రూరల్: నూతనంగా ఎన్నికైన టీజీఓ నాయకులు గురువారం హైదరాబాద్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బలరాజారెడ్డి, కోశాధికారి సందీప్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలు చరిత, సహాయ కార్యదర్శి ప్రసన్నకుమార్, జకీర్ అలీ, హమీద్, రవి, టీజీఓ మాజీ అధ్యక్షుడు మోహన్‌రావు, శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

టీచర్లు సమయపాలన పాటించాలి

నకిరేకల్: ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విధులకు హాజరుకావాలని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) బి.భిక్షపతి సూచించారు. నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ చూపుతూ ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన విద్య నందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు. ఆయన వెంట ఎంఈఓ మేకల నాగయ్య, పాఠశాల హెచ్ఎం నర్సింహ, ఉపాధ్యాయులు శ్రీపాది నాగేంద్రప్రసాద్ తదితరులు ఉన్నారు.



చందుపట్ల హైస్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ భిక్షపతి

డిప్యూటీ సీఎంకు వినతి

మునుగోడు: గ్రామాల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు చెల్లించాల్సిన బిల్లులు వెంటనే అందించాలని కోరుతూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను మునుగోడు మండలం గుండ్లోరిగూడెం గ్రామానికి చెందిన జంగిలి నాగరాజు గురువారం హైదరాబాద్‌లో కలిసి విన్నవించారు. తాను మూడు నెలల క్రితం ఎస్‌డీఎఫ్ నిధుల ద్వారా అభివృద్ధి పనులు చేస్తే నేటికీ బిల్లులు అందలేదన్నారు. పనులు చేయడానికి తెచ్చిన అప్పులకు వడ్డీలు అధికమవుతున్నాయని వివరించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకుడు వట్టికోటి శేఖర్ ఉన్నారు.

మూసీ జలాల్లో కాలుష్యాన్ని తొలగించాలి

చిట్యాల: మూసీ జలాలు కాలుష్యం బారిన పడకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ కోరారు. చిట్యాలలో గురువారం సీపీఐ మండల సహాయ కార్యదర్శి జిల్లా సత్యం అధ్యక్షతన జరిగిన మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మూసీ పరీవాహక ప్రాంతాల్లో పరిశ్రమల నిర్వహణకు అనుమతులు ఇవ్వొద్దని, మూసీ నదిలోకి రసాయన వ్యర్థాలను వదులుతున్న పరిశ్రమల యజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి అక్బర్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు బొడిగె సైదులుగౌడ్, మండల కౌన్సిల్ సభ్యులు బొలూగూరు లింగయ్య, దేశగాని బాలరాజు, గుండాల సత్తయ్య, రావుల చినవెంకన్న, దండిగ నర్సింహ పాల్గొన్నారు.

సైదిరెడ్డి అంత్యక్రియలు పూర్తి

- బాలికను గతంలో విక్రయించిన వారికే ఇచ్చేలా ఒప్పందం
- సైదిరెడ్డి భార్యకు రూ.15 లక్షలు ఇచ్చేలా ఖరారు !

నాంపల్లి : కన్న బిడ్డ కనిపించడం లేదని మనస్తాపంతో గట్లమల్లేపల్లి గ్రామంలో సైదిరెడ్డి అనే వ్యక్తి మూడు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. కాగా సైదిరెడ్డికి ఆయన తండ్రి నర్సిరెడ్డి గురువారం తలకొరివి పెట్టి అంత్యక్రియలు చేశారు. అయితే సైదిరెడ్డి కూతురు వర్షికను గతంలో విక్రయించిన వారికే తిరిగి ఇచ్చే ప్రయత్నంలో ఆ కుటుంబం, గ్రామస్తుల మధ్య ఒప్పందం జరుగుతున్నట్లు సమాచారం. తల్లికి ఆ కుటుంబంతో ఎలాంటి సంబంధం లేకుండా రూ.15లక్షల పరిహారం అందించే దిశగా చర్చలు జరుగుతున్నాయి. బాలిక వర్షికను కొనుక్కున్న వారు ఇచ్చిన డబ్బులతో తల్లికి పరిహారం ఇస్తున్నట్లు తెలుస్తోంది.బాలికను శుక్రవారం గుంటూరుకు తీసుకెళ్లనున్నట్లు సమాచారం.

రక్తదానం

నార్కట్‌పల్లి : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో నార్కట్‌పల్లికి చెందిన 15 మంది ఆపద్బాంధవ్ ఫౌండేషన్ సభ్యులు రక్తదానం చేసినట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు పంజాల శశికుమార్ తెలిపారు. ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు పొట్టపంగి గణేశ్, రవీందర్, శ్రీకాంత్, అరుణ్, స్వప్న, అరవింద్, ప్రహ్లాద, డేవిడ్ పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండ పట్టణంలోని వివిధ కాలనీల్లో నిర్వహించిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. మాజీ కౌన్సిలర్ బొజ్జ నాగరాజు, నాగిరెడ్డి, మిర్యాల వెంకటేశం, నీరజ, విజయ పాల్గొన్నారు.

బీజేపీతోనే ప్రజలకు భద్రత

నల్లగొండ రూరల్: బీజేపీతోనే ప్రజలకు భద్రత, భరోసా లభిస్తుందని బీజేపీ మాజీ ఎమ్మెల్యే ధర్మారావు అన్నారు. గురువారం నల్లగొండ మండలంలోని కొత్తపల్లి, జీ.చెన్నారం గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, నల్లగొండ మండల అధ్యక్షుడు అనిల్‌కుమార్, సాంబయ్య, లింగస్వామి, విద్యాసాగర్‌రెడ్డి, ప్రమోద్, మహేష్‌గౌడ్, సురేష్, సూరారెడ్డి, నాగరాజు, శ్రీహరి, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు: మండల కేంద్రంలో గురువారం బీజేపీ మండల అధ్యక్షుడు పెంబళ్ల జానయ్య పార్టీ కార్యకర్తలకు బీజేపీ సభ్యత్వాలు అందజేశాడు. కంభంపాటి నర్సింహ, అక్కెనపల్లి సతీష్, పందుల యాదయ్య, స్వామి, నెల్లికంటి రమేష్ పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, నాగం వర్షిత్‌రెడ్డి

సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

చండూరు : ప్రజా సమస్యలపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గట్టుప్పల్ మండల కేంద్రంలో గురువారం సీపీఎం మండల మహాసభ నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ జెండాను ఎండీ రబ్బాని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ గట్టుప్పల్ మండల పరిధిలో ఏర్పాటు చేసే ఫార్మా కంపెనీ రద్దు చేసేంతవరకు పోరాటం కొనసాగుతుందన్నారు. చాపల మారయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు నారి ఐలయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్ట నరసింహ, సీంపల్లి చంద్రమౌళి, కర్నాటి మల్లేశం, ఏర్పుల యాదయ్య, ధనుంజయ్య, బొట్ట శివకుమార్, సుధాకర్, గొడ్డలి శ్రీను, అచ్చిని శ్రీనివాస్, శ్రీశైలం, గోపాల్ రెడ్డి, రాములు, నరసింహ, నగేష్, లింగస్వామి బుచ్చిరెడ్డి, సాయిలు, యాదయ్య, భిక్షం పాల్గొన్నారు.

గాదరి కిశోర్ దిష్టిబొమ్మ దహనం

శాలిగౌరారం: సీఎం రేవంత్‌రెడ్డితోపాటు రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా గురువారం శాలిగౌరారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద గాదరి కిశోర్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి వెంకట్‌రెడ్డిలపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరం రెడ్డి, అన్నెబోయిన సుధాకర్, గూని వెంకటయ్య, బండపల్లి కొమరయ్య, ఎర్ర చైతన్య, చింత ధనుంజయ్య, షేక్ ఇంతియాజ్, మల్లయ్య, జనార్దన్, అశోక్‌రెడ్డి నర్సింహ, అంజయ్య, కిశోర్, అరుణ్, పరమేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

క్షమాపణ చెప్పాలి

నకిరేకల్ : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిపై తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నేత దైద రవీందర్ డిమాండ్ చేశారు. నకిరేకల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన వెంట గార్లపాటి రవీందర్‌రెడ్డి, యూసఫ్, వంటెపాక నక్షత్, మహేష్, సతీష్, సూరి తదితరులు ఉన్నారు.

కనగల్: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన గాదరి కిశోర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ గురువారం కనగల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కిశోర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పందుల రాజా, మండల ఉపాధ్యక్షుడు పొట్టిపాక మహేందర్, నామ అశోక్, కిన్నెర స్వామి, ఆదిమల్ల సైదులు, కొండ నరేందర్, కొండా శ్రవణ్ పాల్గొన్నారు.



శాలిగౌరారం : దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోమటిరెడ్డిని విమర్శించే స్థాయి కిశోర్‌కు లేదు

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని విమర్శించే స్థాయి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కు లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం కనగల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ జెడ్పీటీసీ చిట్ల వెంకటేశం గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ భారత్ వెంకటేశం, ఏఎంసీ మాజీ చైర్మన్ గుండెబోయిన భిక్షం, గోలి జగాల్‌రెడ్డి, బోగరి రాంబాబు, నర్సింగ్ కృష్ణయ్యగౌడ్, సీహెచ్ వెంకన్న, కూసుకుంట్ల రాజారెడ్డి, జి నరసింహ, ఎండి హాపీజోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ

నల్లగొండ రూరల్: ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు మేనేజర్ సీహెచ్.సైదులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ డ్యూటీ అసిస్టెంట్, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, డయాలసిస్ టెక్నీషియన్ తదితర కోర్సుల్లో మిర్యాలగూడలో శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 26లోగా రెడ్డి కాలనీ, పాత బ్రిలియంట్ పాఠశాలలో దరఖాస్తులను చేసుకోవాలని, వివరాలకు 9848581100, 9515651160 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ



విజయకేతనం చూపుతున్న ఎస్పీఆర్ విద్యార్థులు, పాఠశాల యాజమాన్యం

నల్లగొండ: ఇటీవల నిర్వహించిన శ్రీనివాస రామానుజన్ టాలెంట్ టెస్టులో ఎస్పీఆర్ హైస్కూల్‌కు చెందిన 26 మంది విద్యార్థులు ప్రతిభ చూపి రెండో దశ అర్హత సాధించారని పాఠశాల చైర్మన్ బైరెడ్డి హిమవంతరెడ్డి, కరస్పాండెంట్ నన్నూరి రాంరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ కొరివి వరప్రసాద్, ప్రిన్సిపాల్ అంథోనిలు గురువారం తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు, సహకరించిన ఉపాధ్యాయులకు వారు ధన్యవాదాలు తెలిపారు.

27న రైతుల ఆత్మీయ సమ్మేళనం

శాలిగౌరారం: మూసీనది ప్రక్షాళన కార్యక్రమానికి మద్దతుగా ఈ నెల 27న శాలిగౌరారం మండలం గురుజాల, అడ్డగూడూరు మండలం మానాయికుంట గ్రామాల మధ్య మూసీనదిపై ఉన్న హైలెవల్ బ్రిడ్జిపై నిర్వహించనున్న మూసీ పరివాహక రైతుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరం రెడ్డి కోరారు. శాలిగౌరారంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ మండల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

పెట్రోలు బంక్ తనిఖీ

కట్టంగూర్: మండలంలోని పామనగుండ్ల గ్రామంలో గల ఆర్‌పీ పెట్రోల్ బంక్‌ను గురువారం జిల్లా తూనికలు కొలతల అధికారి పి రామకృష్ణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంక్‌లో ఉన్న పంపుల డెలివరీ తనిఖీ చేయగా అంతా సక్రమంగా ఉందని తేలినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట సివిల్ సప్లయ్ డీటీ రాచకొండ జ్యోతి ఉన్నారు.

ఇరువురిపై కేసు నమోదు

ఇటీవల ఆర్‌పీ పెట్రోల్(ఇండియన్ ఆయిల్) బంక్‌లో జరిగిన గొడవపై ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం రవీందర్ తెలిపారు. ఈ నెల 23న ఓ కారులో వచ్చిన చింత శరత్‌కుమార్ అనే వ్యక్తి తన కారులో 42 లీటర్ల పెట్రోలు పోయించుకుని డబ్బులు అడగగా తన కారు ట్యాంక్ కెపాసిటీ 35 లీటర్లని 42 లీటర్లు ఎలా కొడతారని సిబ్బందిని బూతులు తిట్టి దౌర్జన్యం చేశారని బంక్ సూపర్‌వైజర్ గుడుగుంట్ల జానయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు శరత్‌కుమార్‌తో పాటు అతడి వెంట ఉన్న మరో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అదేవిధంగా కారు యజమాని శరత్‌కుమార్ ఆన్‌లైన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు బంక్ యాజమాని వివేక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

మునుగోడు: షార్ట్ సర్క్యూట్‌తో పూరి గుడిసె దగ్ధమైంది. ఈ ఘటన గురువారం మునుగోడు గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మీదేవిగూడెంలో జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీదేవిగూడేనికి చెందిన దుగ్గి శేఖర్ కొన్నేళ్ల క్రితం గ్రామంలో పూరి గుడిసె నిర్మించుకుని కుటుంబంతో కలిసి అందులోనే నివాసముంటున్నాడు. తన గుడిసెకు విద్యుత్ కనెక్షన్ కోసం ఓ విద్యుత్ ఉద్యోగికి రెండేళ్ల క్రితం డీడీ కట్టి విద్యుత్ మీటర్ ఇవ్వాలని కోరాడు. కానీ ఆ ఉద్యోగి విద్యుత్ మీటర్ ఇవ్వకుండా అనధికారికంగా విద్యుత్ సౌకర్యం పొందాలని శేఖర్‌కు సూచించాడు. శేఖర్ సాధారణ వైర్ల ద్వారా విద్యుత్ వినియోగిస్తుండగా గురువారం షార్ట్ సర్క్యూట్ అయ్యి గుడిసె మొత్తం కాలిబూడిదయ్యింది. ఘటన జరిగిన సమయంలో ఇంట్లో ఉన్నవారు బయటకు రావడంతో పాటు ఇంట్లో దాచుకున్న రూ.40వేలు నగదును బయటకు తెచ్చుకున్నారు. మిగిలిన సామగ్రి, దుస్తులు, బియ్యం మొత్తం కాలిపోయాయి. విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా నష్టపోయిన శేఖర్‌ని ప్రభుత్వం ఆదుకోవాలని వివిధ పార్టీల నాయకులు కోరుతున్నారు.